క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతివార్షిక దివ్యలీల కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి అశ్లేషబలి కార్యక్రమం, స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం మహా అన్నప్రసాద వితరణ చేశారు.

ఫ్లెక్సీలు చించినవారిపై చర్య తీసుకోవాలి



వేలేరు : మండంలోని ఎర్రబెల్లి శివారు బైరవు నిబండ వద్ద నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతరలో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ముద్దసాని వరుణ్ కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

గుండెపోటుతో భక్తుడు మృతి



మృతి చెందిన రవీందర్

ఏటూరునాగారం: మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. హనుమకొండ జిల్లా ఐనవోలు గ్రామానికి చెందిన ఎర్రం రవీందర్(50)భార్య రాజ్యలక్ష్మి, ముగ్గురు పిల్లలతో కలిసి మేడారంలో జాతర సందర్భంగా కూల్‌డ్రింక్ షాపు పెట్టాడు. కాగా, శుక్రవారం తల్లులను దర్శించుకునే క్రమంలో క్యూలో ఒత్తిడి కారణంగా గుండెపోటుకు గురయ్యాడు. దీంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఇప్పటికీ జాతరలో నలుగురు మృతి చెందగా 75 మందికి గాయాలయ్యాయి.

జాన్ మార్కండేయకు డాక్టరేట్



కాజీపేట: కాజీపేట పట్టణంలోని అల్ఫా ఓమేగా చర్చి వ్యవస్థాపకుడు, కొంతకాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న బిషప్ జాన్ మార్కండేయ.. శుక్రవారం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆయనకు డే స్ప్రింగ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా మార్కండేయకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ ఇండిపెండెంట్ బిజినెస్ కౌన్సిల్ అధ్యక్షుడు మార్టిన్ పాల్గొన్నారు.

'హనుమంతు నియామకం అభినందనీయం'

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ–స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఎస్‌డబ్ల్యూయూ)లో అతి కీలకమైన రాష్ట్ర సెక్రటరీ జనరల్ పదవి టీజేఎంయూ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి హనుమంతును వరించడం అభినందనీయమని టీజేఎంయూ నర్సంపేట డిపో మాజీ సెక్రటరీ గొలనకొండ వేణు తెలిపారు. పట్టణంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ హోదాలో హనుమంతు ఉద్యోగుల హక్కుల సాధనకు పాటుపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టీసీలోని అన్ని యూనియన్లలో ఉన్న కార్మికులందరూ ఐఎన్‌టీయూసీ–ఎస్‌డబ్ల్యూయూలో చేరి యూనియన్‌ను బలోపేతం చేయాలని కోరారు.

టీఎన్జీఓస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌కు సన్మానం



కాజీపేట అర్బన్: టీఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అన్నమనేని జగన్‌మోహన్‌ను హనుమకొండ వికాస్‌నగర్‌లోని తన నివాసంలో మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఈసంపెల్లి సంజీవ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్‌రెడ్డి, మడికొండ బాబు, కలకోట్ల జయరాం, పసునూరి బాబు, జిలకర స్వామి, గుండా రమేష్, మామిడాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : వనదేవతలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కమలాపూర్ : సమ్మక్కకు ఎదురుకోళ్లు ఎగురవేస్తున్న భక్తులు



ఎల్కతుర్తి : బంగారం (బెల్లం) కోసం గుమిగూడిన భక్తులు



సల్లంగచూడు సమ్మక్కతల్లి

- మినీ జాతరల్లో బారులుదీరిన భక్తులు
- వనదేవతలకు ఎత్తుబెల్లం, మొక్కులు సమర్పణ

జిల్లా వ్యాప్తంగా మొదలైన మినీ జాతరల్లో శుక్రవారం భక్తులు బారులుదీరారు. గురువారం సాయంత్రం సమ్మక్కతల్లి గద్దెకు చేరడంతో మొక్కులు చెల్లిచేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎత్తు బెల్లం, మొక్కులు సమర్పించి సల్లంగచూడు సమ్మక్కతల్లి అంటూ వేడుకున్నారు.



ఆత్మకూరు : జాతరలో పోటెత్తిన భక్తులు



కమలాపూర్ : తల్లులను దర్శించుకుంటున్న శాలిని



ఎల్కతుర్తి : తల్లులకు మొక్కులు చెల్లిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్



ఆత్మకూరు : మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి దంపతులు

ఎల్కతుర్తి : మండలంలోని ముల్కనూరు, కొత్తకొండ, దామెర గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మను భక్తులు దర్శించుకొని చీరసారే, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. దీంతో జాతర ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జాతరలో వెలసిన మిఠాయిలు, ఆట వస్తువులు కొనేందుకు పెద్ద ఎత్తున ప్రజలు ఆసక్తి కనబర్చారు. కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. స్థానిక సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు గోదారి రాజ్‌కుమార్, సాయిబాబు, నీలోజు వెంకటేశ్వర్లు బందోబస్తు నిర్వహించారు. అలాగే ఎంపీడీఓలు వీరేశం, విజయ్‌కుమార్, పంచాయితీ కార్యదర్శులు జీపీ సిబ్బందితో జాతర ఆవరణలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు స్వప్న, అనీతరమేష్, జెడ్పీటీసీ రవీందర్, బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నగేష్, సింగిల్‌విండో చైర్మన్ రవీందర్‌గౌడ్, ఆధారి రవీందర్, మహేందర్, చంద్రమౌళి పూజారులు భూమయ్య, నర్సింహరాజు ఆలయ కమిటీ చైర్మన్‌లు వీరస్వామి, ఠాగూర్‌రామ్ సింగ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కమలాపూర్ : సమ్మక్క–సారలమ్మ మినీ జాతరకు భక్తులు పోటెత్తారు. కమలాపూర్, కన్నూరు, మాదన్నపేట, మర్రిపల్లిగూడెం, గ్రామాల్లో శుక్రవారం జాతర వైభవంగా జరిగింది. మండల వ్యాప్తంగా భక్తులు ఇలవేల్పులైన సమ్మక్క–సారలమ్మ తల్లులను దర్శించుకుని ఓడి బియ్యం, ఎత్తుబంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సతీమణి శాలిని హాజరై తల్లులను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించగా, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు సేవలందించారు. జాతర ఉత్సవ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని కంతాత్మకూర్‌లో జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ మినీ జాతరను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సందర్శించారు. వన దేవతలను శుక్రవారం ఆయన దర్శించుకొని మొక్కులు చెల్లించారు. జాతర కమిటీ చైర్మన్ రాయిడి రాజిరెడ్డి, బారాబరి వెంకటస్వామి పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని పీచర, ఎర్రబెల్లి గ్రామాల్లోని సమ్మక్క– సారలమ్మ మినీ జాతరకు భక్తులు పోటెత్తారు. తల్లులకు ఎత్తు బంగారం, తలనీలాలు, ఎదురుకోళ్లను సమర్పించారు.



ఆత్మకూరు : అగ్రంపహాడ్ జాతరలో బారులుదీరిన భక్తులు

ఆత్మకూరు : అగ్రంపహాడ్ భక్తజనసంద్రమైంది. ఎక్కడ చూసినా భక్తులతో పరిసరాలు కిటకిటలాడాయి. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచాయి. అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతరలో గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క–సారలమ్మను దర్శించుకునేందుకు వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. శుక్రవారం ఉదయం నుంచే భక్తులు బారులుదీరారు. అమ్మవార్లకు ఎత్తుబెల్లాలు, చీరసారె సమర్పించుకున్నారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దంపతులు సమ్మక్క–సారలమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆర్డీఓ శ్రీనివాస్, ఏసీపీ కిశోర్‌కుమార్, ఈఓ శేషగిరి, జాతర చైర్మన్ శీలం రమేష్ జాతరను పర్యవేక్షించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో గంటల పాటు క్యూలైన్లలో నిల్చున్న భక్తులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



వేలేరు : మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



కమలాపూర్ : బంగారం కోసం గుమిగూడిన భక్తులు

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జమాల్‌ఉద్దీన్

నడికూడ : ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యతని వినియోగదారుల సమాచార కేంద్రం మండల అధ్యక్షుడు మహ్మద్ జమాల్‌ఉద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కంతాత్మకూర్‌లో జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ మినీ జాతరకు వచ్చిన భక్తులకు ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. జాతరకు వచ్చే భక్తులు ప్లాస్టిక్ క్యారీబ్యాగులు ఉపయోగించొద్దని అన్నారు. గుడ్డ సంచి లేదా జ్యూట్ బ్యాగులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ రాయిడి రాజిరెడ్డి, ఆదిల్, జీవన్‌రెడ్డి, చుక్క సతీష్, జాతర కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ సరిత

వేలేరు : మండల కేంద్రంలో రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ చాడ సరిత శుక్రవారం భూమిపూజ చేశారు. రాజ్యసభ సభ్యుడు కేశవరావు తన నిధుల నుంచి రూ. 10లక్షలు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. నిధులు మంజూరుకు సహకరించిన మండల కేంద్రానికి చెందిన కుడా మాజీ డైరెక్టర్ బీల్లా యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంధ్యా భూపతిరాజు, సంపత్, ప్రసాద్, శంకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు



పూజా కార్యక్రమాలను తిలకిస్తున్న భక్తులు

రాయపర్తి : మండలంలోని సన్నూరు వెంకటేశ్వరపల్లి గ్రామంలోని ఆలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గరుడ హోమం, తిరుచ్చి వాహనసేవ, ధ్వజారోహనం (గరుడముద్దలు), నిత్య హోమం, బలి హరణం, ఎదుర్కోళ్ల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు, ప్రధాన అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి రాకుండా అడ్డుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

వర్ధన్నపేట : బీఆర్ఎస్ నాయకుడు మార్నేని రవీందర్‌రావును కాంగ్రెస్‌లోకి రాకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, కౌన్సిలర్ సమ్మెట సుధీర్ తెలిపారు. మండలంలోని ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో టీడీపీలో, ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు కాంగ్రెస్‌లోకి రావడానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. రవీందర్‌ను కాంగ్రెస్‌లోకి రావడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. స్వార్థ కోసం పార్టీ మారడానికి యత్నిస్తున్న రవీందర్‌రావును చేర్చుకుంటే పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. రవీందర్‌రెడ్డి, ఎల్లాగౌడ్, కుమారస్వామి, సదానందం, సమ్మయ్య, యాదగిరి, బాబు, బాషానాయక్, ఎల్లస్వామి, బచ్చు గంగాధర్‌రావు పాల్గొన్నారు.

ఇంటి హద్దులు తొలగించిన ఐదుగురికి జైలుశిక్ష

పరకాల : ఇంటి హద్దులను తొలగించి స్థల ఆక్రమణతోపాటు గోడను కూల్చివేసిన కేసులో ఐదుగురికి పరకాల జూనియర్ సివిల్ జడ్జి శాలినిలింగం జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. సీఐ రవిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం సీతారాంపూర్‌కు చెందిన మైక మొగిలయ్య, భిక్షపతి, రమేష్, సూరమ్మ, ఉమ కలిసి 2016 సంవత్సరంలో నల్లెల్ల లింగమూర్తి ఇంటి హద్దులు తొలగించారు. ఆక్రమించుకోవడంతోపాటు ఇంటి గోడను కూల్చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్షులను జూనియర్ సివిల్ జడ్జి శాలినిలింగం ఎదుట శుక్రవారం ప్రవేశపెట్టారు. నిందితులతోపాటు సాక్షులను విచారించిన జడ్జి ఐదుగురికి ఒక సంవత్సరం మూడు నెలల జైలు శిక్షతోపాటు రూ.12,500 జరిమానా విధించారు. నిందితులకు శిక్షపడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ అర్థకుమార్, కోర్టు కానిస్టేబుల్ బాబును పోలీసు అధికారులు అభినందించారు.

రైతులను మోసం చేసిన వ్యక్తికి..

శాయంపేట : అరటి మొక్కలు తీసుకొని రైతులకు ఇవ్వకుండా మోసం చేసిన ఘటనలో నిందితుడికి నాలుగేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ పరకాల జూనియర్ సివిల్ జడ్జి శాలినిలింగం శుక్రవారం తీర్పు వెలువరించారు. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన ఆలేటి సతీష్ కిసాన్ ఆగ్రో బయాటెక్స్ నుంచి 800 అరటి మొక్కలను శాయంపేట గ్రామానికి చెందిన ఉప్పునూతుల రామ్మూర్తి, కోల మల్లయ్యకు ఇవ్వడానికి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో శాయంపేటకు చెందిన నల్లెల రమేష్.. మల్లయ్య ఇంటికి బండి వెళ్లదని తన ఇంటికాడ పెట్టుకొని ఇస్తానని 800 మొక్కలను తీసుకున్నాడు. రైతులకు ఇవ్వకుండా మోసం చేయడంతో సతీష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో రమేష్‌పై 2017లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి చీటింగ్ కేసు నమోదు చేశారు. చార్జిషీట్ ఫైల్ చేసి పరకాల కోర్టుకు పంపించినట్లు తెలిపారు. పరకాల మెజిస్ట్రేట్ శాలినిలింగం సాక్షులను విచారించి రమేష్‌కు నాలుగేళ్ల సాధారణ జైలు శిక్ష, నాలుగు వేల జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ సెంటర్ : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల గురుకుల హాస్టల్‌లో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టు భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 29వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. 2023 డిసెంబర్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

గంగదేవిపల్లిలో అధ్యయనం

గీసుకొండ : ఏపీలోని సత్యసాయి జిల్లా నంబూల పూలకుంట మండలంలోని 12 గ్రామాలకు చెందిన 25 మంది గ్రామ స్థాయి నాయకులు అనంతపురం జిల్లా రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గంగదేవిపల్లిని శుక్రవారం సందర్శించి అధ్యయనం చేశారు.

ప్రజాచైతన్యమే సంకల్ప యాత్ర ధ్యేయం

వర్ధన్నపేట : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గడచిన పదేళ్లలో అందించిన సుపరిపాలనపై ప్రజలను చైతన్యవంతం చేయడమే విజయ సంకల్ప యాత్ర ధ్యేయమని బీజేపీ అనుబంధ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు. ఈనెల 29న విజయ సంకల్ప యాత్ర నియోజకవర్గ కేంద్రానికి చేరుకోనున్న నేపథ్యంలో మండలంలోని ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్స్‌లో పార్టీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీధర్ హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనతో భారత్‌కు ప్రపంచ దేశాల్లో తగిన గుర్తింపు లభించిందని చెప్పారు. బీజేపీ మూడోసారి అఖండ విజయం సాధించేలా విజయ సంకల్ప యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. గడచిన పదేళ్లలో దేశం గర్వించేలా మోదీ చారిత్రక నిర్ణయాలు తీసుకుని ధైర్యంగా అమలు చేశారన్నారు. ఆర్టికల్ 370 తొలగించి కాశ్మీర్‌లో స్వతంత్ర్యం తీసుకొచ్చారని అన్నారు.